సాక్షి
పల్నాడు
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



అగ్నిమాపక వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా కోటప్పకొండ టీటీడీ వేద పాఠశాలలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.



గ్రంథాలయం సందర్శన

యడ్లపాడు: స్థానిక శాఖా గ్రంథాయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్రత్రమ్మ సందర్శించారు. పుస్తకాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.6500, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏబీసీకి నీరు విడుదల

డీఈ రామారావు



శావల్యాపురం: తాగునీటి అవసరాల నిమిత్తం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు తెలిపారు. మంగళవారం మండలంలోని పోట్లూరు వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్(ఏబీసీ)ని పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ ఈనెల 8న సాగర్ జలాశయం నుంచి 5,500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల 12వ నాటికి కెనాల్‌కు నీరు చేరిందని, ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా పరిధిలో అన్ని మేజరు కాలువలకు 900 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు వివరించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏబీసీ పరిధిలోని 26 మేజరు కాలువలకు 900 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. మంచినీటి చెరువులు, వాగులు, కుంటలు నూరుశాతం సాగర్ జలాలతో నింపాలని కోరారు. నీటిని తాగునీటి అవసరాల నిమిత్తమే వినియోగించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా శావల్యాపురం పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈనెల 25వ తేదీ వరకు సాగర్ జలాలు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నెస్పీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో మంచినీటి చెరువులన్నీ పూర్తి స్థాయిలో నింపే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ, ఎన్నెస్పీ సిబ్బంది నందకిషోరు ఉన్నారు.

108 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లాలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 108 అంబులెన్సులో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. అభ్యర్థులకు బీఎస్సీ, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, డీఎంఎల్టీ ఐదేళ్ల అనుభవం అర్హతతోపాటు 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, వట్టిచెరుకూరు, తుళ్లూరు, ఫిరంగిపురం, కొల్లిపర మండలాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హత ఉన్నవారు తమ సర్టిఫికెట్లతో ఈ నెల 20వ తేదీ లోపు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం రెండో అంతస్తులోని తమ ఆఫీసులో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9121892889 నంబరు సంప్రదించాలన్నారు.

పరిశీలకుల కోసం ఏర్పాట్లు చేయండి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు రానున్న పరిశీలకులు ఉండేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రోడ్లు భవనాల వసతి గృహంలోని గదులను కలెక్టర్, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమించే పరిశీలకులు జిల్లాకు రానున్నారని వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ బాధ్యతలను జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషాకు అప్పగించారు. కలెక్టర్‌తో ఆర్డీఓ పి.శ్రీకర్, డిఎస్‌ఓ కోమలి పద్మ, అధికారులు ఉన్నారు.

యార్డులో 88,620 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 68,903 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,620 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,678 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఆదర్శం.. ఆత్మకూరు కాలనీ

పేదింటి సౌభాగ్యం

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రెండు సెంట్లు కేటాయింపు
- తొలగించిన ఇళ్లకు నష్టపరిహారం అందజేత
- అదనంగా ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు
- 12 ఎకరాలలో జగనన్న కాలనీ
- రూ.7 కోట్లతో రోడ్లు, మౌలిక వసతులు
- రికార్డు స్థాయిలో ఇళ్ల నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులు



ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీలోని సొంతింటి వద్ద షేక్ షఫియా

ఈమె పేరు షేక్ షఫియా. భర్తతో కలసి బకింగ్ హామ్ కాలువ కట్టపై గుడిసెలో ఉండేవారు. కొడుకు దూర ప్రాంతంలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. భర్తకు పింఛన్ వస్తోంది. చిన్నచిన్న పనులు చేసుకుని బతుకుతున్నారు. రేషన్ కార్డు కూడా లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు నోచుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం వలంటీర్ వచ్చి రేషన్ కార్డు మంజూరు చేయించారు. ఆమె ఇంటికి నష్టపరిహారంగా రూ.2.50 లక్షలు ఇచ్చారు. దీనికి తోడు జగనన్న కాలనీకి మంజూరు చేసిన మొత్తం రూ.1.80 లక్షలు ఇచ్చారు. అదనంగా కొంత వేసుకుని ఇంటిని సుందరంగా తీర్చిదిద్దుకున్నారు. ఇళ్ల తొలగింపంటే ముందు భయపడ్డాం. జగనన్న చేసిన మేలుతో సొంతింటి కల నెరవేరింది. జగనన్నకు రుణపడి ఉంటామని షేక్ షఫియా ఆనందంగా చెప్పారు.



కట్టపై ఓ పాత ఇల్లు (ఫైల్)

మంగళగిరి: వాళ్లంతా నిరాశ్రయులు.. అభాగ్యులు.. రెక్కాడితేగాని డొక్కాడని బడుగులు.. పొద్దు పొడవకముందే ఇంటి నుంచి బయటపడేవారు.. పని కోసం నిరీక్షించేవారు.. ఆ రోజు పని దొరికితే చేసుకునేవారు.. లేకుంటే లేదు. వారు గూడు కోసం కాలువ కట్టనే ఆశ్రయించారు. చిన్న పరదాలు వేసుకొని జీవించేవారు. సగం బతుకు రోడ్డుపైనే. టీడీపీ అధికారంలో ఉండగా సుందరీకరణ పేరుతో ఆ పేదలను తరలించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే సొంతింటి కల సాకారం చేశారు. సౌభాగ్యవంతులను చేశారు. ఆత్మకూరు జగనన్న కాలనీ ఆవిర్భవించింది. ఇది రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది.



ఆత్మకూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీ

ఆత్మకూరు జగనన్న కాలనీ..	
మొత్తం లబ్ధిదారులు	283
పంపిణీకి కేటాయించిన ఎకరాలు	12
పూర్తయిన ఇళ్ల సంఖ్య	215
వివిధ దశల్లో ఉన్న ఇళ్లు	68
స్థలం కొనుగోలుకు ఖర్చు	రూ.11.52 కోట్లు
బాధితులకు నష్టపరిహారం	రూ.7.52 కోట్లు

వలస కూలీలకు సొంత గూడు

తాడేపల్లి బకింగ్ హామ్ కాలువ కట్టను ఆసరా చేసుకుని ఎంతో మంది పేదలు ఎన్నో ఏళ్లుగా ఉండేవారు. సుమారు 283 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎక్కువ మంది రోజువారీ కూలీలు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అక్కడ నివాసం దినదినగండంగా ఉండేది. ఎప్పుడు అధికారులకు కోపం వచ్చినా ఇక్కడ ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పేదలకు ప్రత్యామ్నాయం చూపించిన తరువాతే రోడ్డు విస్తరణకు ఖాళీ చేయించారు. ఆత్మకూరులో పొలాలు కొనుగోలు చేసి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం చేసి అందజేశారు. తాజాగా రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. తొలగించిన ఇళ్లకు నష్టపరిహారంగా రూ.7,52,81,553 చెల్లించారు. ఒక్కో నిర్వాసితుడికి రూ.1.50 లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు నష్టపరిహారం అందింది. ప్రభుత్వం ఉచితంగా రెండు సెంట్ల స్థలం కేటాయించడంతోపాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరుచేసిన రూ.1.80 లక్షలు, వచ్చిన నష్టపరిహారంతో నిర్వాసితులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించి కొందరు ఏడు నెలలకే గృహప్రవేశాలు చేశారు.



కాలనీకి వేసిన రోడ్డు

శరవేగంగా మౌలిక వసతులు

మరో వైపు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో తాగునీరు, విద్యుత్, రోడ్ల వంటి మౌలిక వసతులు అధికారులు వెంటనే ఏర్పాటు చేశారు. తాడేపల్లి జాతీయ రహదారి నుంచి వడ్డేశ్వరం, ఇప్పటం మీదుగా అప్రోచ్ రోడ్డు, మంగళగిరి నుంచి పెద వడ్లపూడి మీదుగా మరో అప్రోచ్ రోడ్డు రూ.4 కోట్లతో వేశారు. మరో రెండున్నర కోట్లు వెచ్చించి తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారు.

ఆనందమంటే ఇప్పుడే...



కట్ట విస్తరణ కోసం ఇళ్లు తొలగించిన సమయంలో ఆందోళన చెందాం. ఎమ్మెల్యే ఆర్కే అండగా ఉన్నారు. జగనన్న భరోసా కల్పించారు. తొలగించేటప్పుడు ఇచ్చిన హామీ మేరకు రెండు సెంట్ల స్థలం ఇచ్చారు. నష్టపరిహారంగా రూ.2.80 లక్షలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు ఇప్పించారు. సొంతిల్లు నిర్మించుకుని ఆనందంగా ఉన్నాం. గతంలో ప్రభుత్వ నీరుపారుదల శాఖ కట్టపై ఉన్నప్పుడు ఎప్పుడు ఇళ్లు తొలగిస్తారో అనే ఆందోళన ఉండేది. ఇప్పుడు అలాంటిది లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నాం. టీడీపీ పాలనలో సీతానగరంలో తొలగించిన వారికి కనీసం స్థలం కూడా ఇవ్వలేదు.

– బళ్ల సావిత్రి,
ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీ

అన్ని వసతులు కల్పించారు



నాకు ఇద్దరు పిల్లలు. నేను, నా భర్త చినవెంకట రెడ్డి కూలిపనులు చేసుకునే వారం. పిల్లల్లో ఒకరు ఇంటర్, మరొకరు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. గతంలో బకింగ్ హామ్ కాలువ కట్టపై నివసించేవారం. అది తొలగించి నష్టపరిహారంగా రెండు లక్షలు మంజూరు చేశారు. ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఇక్కడ ఇల్లు నిర్మించుకున్నాం. రోడ్లతో పాటు తాగునీరు, కరెంట్ తదితర అన్ని సౌకర్యాలు కల్పించారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, విద్యావసతి లాంటి పథకాలు రావడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పిల్లలతో ఆనందంగా జీవించగలుగుతున్నాం.

– రాగి రమాదేవి,
ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీ

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ వెల్లడి
- అన్ని పత్రాలు నిబంధన మేరకు ఉండాలి
- 25 వరకు నామినేషన్ల దాఖలకు అవకాశం
- 26న నామినేషన్ పత్రాల పరిశీలన
- 29 వరకు ఉపసంహరణ గడువు
- వివరాల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు



నరసరావుపేట: ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేయడం జరుగుతుందని, ఆ రోజు నుంచే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరణ ప్రారంభించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ 25వ తేదీ అన్నారు. చివరి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. మూడు గంటల కన్నా ఒక్క సెకండ్ దాటినా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నామినేషన్ తీసుకోవడానికి అవకాశం ఉండదని పేర్కొన్నారు. 26వ తేదీన నామినేషన్లను పరిశీలన ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలని కోరారు. అవి సక్రమంగా ఉంటేనే నామినేషన్లను అంగీకరించటం జరుగుతుందని వివరించారు. నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ వరకు గడువు ఉంటుందని చెప్పారు. మే 13వ తేదీ పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ నాలుగున ఓట్ల లెక్కింపు ఉంటుందని కలెక్టర్ వివరించారు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం–2ఏ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం–2బీ సమర్పించాలని, నోటిఫైడ్ తేదీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. పబ్లిక్ సెలవు దినాలలో నామినేషన్ స్వీకరించబడవన్నారు. అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చని వివరించారు. రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు నామినేషన్లను ఫైల్ చేయలేరన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో గరిష్ఠంగా మూడు వాహనాలు అనుమతించబడతాయని, ఐదుగురు వ్యక్తులు(అభ్యర్థితో సహా) ఆర్‌ఓ ఆఫీస్‌లోకి రావచ్చని వెల్లడించారు. అభ్యర్థి సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించవచ్చని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల మధ్య అభ్యర్థి లేదా అతని ప్రపోజర్ లేదా అతని ఏజెంట్ ద్వారా చేతితో డెలివరీ చేయబడిన క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింట్ అవుట్ సంతకం చేయబడిన సిరాతో నామినేషన్ సమర్పించవచ్చన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వ్యయ పరిశీలనకు నోడల్ అధికారులు

- వ్యయ పర్యవేక్షణకు సంబంధించి నోడల్ అధికారులను నియమించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ పేర్కొన్నారు.
- అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు ఎన్నికల ఖర్చుల ఖాతా సమర్పించడంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రతి అభ్యర్థి షాడో అబ్జర్వేషన్ రిజిస్టార్, ఫోల్డర్ ఆఫ్ ఎవిడెన్స్ నిర్వహణ కోసం అకౌంటింట్ బృందం సహాయ వ్యయపరిశీలకుడు, అబ్జర్వర్ మార్గదర్శకత్వంలో పని చేస్తుందన్నారు.
- వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటన తేదీ నుంచి పోల్ తేదీ వరకు పని చేస్తుందని, అధికారుల మధ్య సమన్వయం అత్యంత ముఖ్యమన్నారు.
- వ్యయం గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు.
- ఎన్నికల కమిషన్ ఎంసీసీ అమలులో ప్రజలను కూడా భాగస్వామ్యం చేసిందని, సీ–విజిల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్లో డౌన్లోడ్ చేసుకోవచ్చని, ప్రజలు వారి ఇంటి వద్ద నుంచే పోస్టర్లు, పాంప్లెట్లు పంపిణీ, ఎంసీసీ ఉల్లంఘనలపై తమ దృష్టికి తీసుకురావచ్చని కోరారు.
- సీ–విజిల్ యాప్ ఫిర్యాదులను సరాసరి 31 నిమిషాల్లోనే పరిష్కరిస్తున్నామని, నాణ్యతగా ఫిర్యాదులకు పరిష్కారం చూపిస్తున్నామని, అన్ని ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.
- అభ్యర్థి నామినేషన్ దగ్గర నుంచీ, ఖర్చు అతడి ఖాతాలో లెక్కించడం జరుగుతుందని చెప్పారు. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను అభ్యర్థి ఖాతాలో లెక్కించడం జరుగుతుందని చెప్పారు.

24న డాక్టర్ పి.అనిల్, డాక్టర్ గోపిరెడ్డి నామినేషన్

నరసరావుపేట: ఈనెల 24వ తేదీన వైఎస్సార్ సీపీ తరఫున నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఒకటో వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి ప్రకటించారు. మీడియాతో మాట్లాడుతూ రెడ్డినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భారీ ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం చేరుకొని నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నరసరావుపేట నుంచి హ్యాట్రిక్ విజయం సాధించనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వినుకొండ దాహార్తి తీర్చిన ఘనత మాదే

- ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా
- సింగరచెరువు పరిశీలన



సింగరచెరువును పరిశీలిస్తున్న అనిల్‌కుమార్, బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణానికి తాగునీరు అందించే సింగరచెరువును నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మంగళవారం సందర్శించారు. ఇటీవల నాగార్జున సాగర్ నుంచి తాగునీటి కోసం విడుదల చేసిన నీటితో 270 ఎకరాల చెరువును పూర్తిస్థాయిలో నింపడం జరిగింది. ఈ సందర్భంగా అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా వినుకొండ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరిష్కరించినట్లు చెప్పారు. ఐదేళ్లల్లో ఏ ఒక్క రోజు కూడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసినట్లు వివరించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయసహకారాలతో వినుకొండ పట్టణ ప్రజలకు మండు వేసవిలో కూడా తాగునీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో చెరువులను నింపి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నాయకులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హయాంలో తాగునీటి సమస్యను అడ్డంపెట్టుకొని ట్యాంకర్లతో నీటి సరఫరా చేసి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. మరో మాజీ ఎమ్మెల్యే ప్రజల తాగునీటిని చేపల చెరువులకు మళ్లించుకుని ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు. ఇప్పుడు కూడా తాగునీరు నింపే కాలువలకు అక్రమంగా అడ్డీలు, తూములు ఏర్పాటు చేసి నీటి సరఫరాను అడ్డుకుంటున్నారని, తాగునీటిపై మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడే అర్హత లేదన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటిని సరఫరా చేస్తామని అన్నారు.

రేపు మెగా బైక్ ర్యాలీ

- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 24న సత్తెనపల్లిలో నామినేషన్ దాఖలు

రాజుపాలెం: ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పల్లెలను చుట్టివస్తున్నారు. శ్రేణులను చైతన్యం చేసేందుకు నాయకులను సమన్వయ పరుస్తున్నారు. మంగళవారం మండలంలోని ఇనిమెట్ల, ఉప్పలపాడు, బలిజేపల్లి, కొత్తూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ గురువారం నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి రాజుపాలెం, నకరికల్లు, ముప్పాళ్ల మండలాలను కలుపుతూ మెగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నామని, అలాగే 24వ తేదీన సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నామినేషన్‌తోనే విజయం అంబటిదేనని స్పష్టమైన సంకేతం ఇవ్వాలని అన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ టి.రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ డి.సునీతశ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్, సర్పంచి పి.అశోక్, సర్పంచి సయ్యద్‌హుస్సేన్, జీడీసీఎంఎస్ డైరెక్టర్ పి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ ఎస్‌కే మహబూబ్ సుభాని, ఎస్‌కే సీలార్‌బీ, మాజీ ఎంపీటీసీ బి.శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ ఎల్.సీతయ్య, మౌలాలీ, బొ్రయ్య, డొక్కా చిన్న ఉన్నారు.



ఇనిమెట్లలో ప్రచారం నిర్వహిస్తున్న అంబటి

నామినేషన్ విజయవంతానికి..

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఈ నెల 24న వైఎస్సార్ సీపీ తరఫున సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో నామినేషన్ విజయవంతంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వర రావు నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. గురువారం ఉదయం 6 గంటలకు మంత్రి అంబటి రాంబాబు పార్టీ శ్రేణులతో కలసి మెగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, షేక్ మౌలాలి, పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీనివాసరావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆంధ్రజ్యోతి కథనంలో వాస్తవంలేదు

డీఎస్ఓ పద్మశ్రీ

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా పేదల ఆహార భద్రత కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం, ఇతర నిత్యావసరాల పంపిణీపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం గాదె కింద పందికొక్కు.. కోతవేసే పప్పూ.. ఉప్పూ అంటూ వచ్చిన కథనంలో ఎటువంటి వాస్తవం లేదని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ పేర్కొన్నారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటన ద్వారా.. ప్రతి నెలా 402 మొబైల్ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి వేలిముద్రల ఆధారంగా పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 5,54,455 మందికి ఫోర్టిఫైడ్ బియ్యం, 5,08,086 మందికి కందిపప్పు, 4,46,353 మందికి పంచదార, 67,683 మందికి గోధుమ పిండి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందజేయటం జరిగిందన్నారు. డోర్ డెలివరీ ద్వారా ప్రతి నెలా 88 శాతం వరకు పంపిణీ పెరిగిందన్నారు. సంబంధిత అధికారులమైన తాము నిత్యం పంపిణీని పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

సాహిత్యంలో నాటక రంగానిది కీలక పాత్ర



నరసరావుపేట ఈస్ట్: తెలుగు సాహిత్యంలోని కథ, కథానిక, కథాంశాలపై రచయిత ఉద్దేశ్యాన్ని ప్రపంచానికి తెలియ చెప్పేదే నాటక రంగమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. పల్నాడు కళాక్షేత్రంలో మంగళవారం సాయంత్రం శ్రీనాథ కళాపరిషత్, పి.సత్యనారాయణరాజు కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు సాహిత్యంలో నాటక రంగ ప్రాధాన్యం అనే అంశంపై డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు నాటక రంగ వైభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా కళాకారులు ఈవూరి వెంకటరెడ్డి, అంజిరెడ్డి, బాబులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రంజిత్‌కుమార్, షేక్ బాజీ, రత్నాకరం రాము పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పీఆర్కే
- టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

విజయపురిసౌత్: మాచర్ల మండలం చింతలతండా తండా గ్రామానికి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పీఆర్కే పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్ పీఆర్కే చేస్తున్న కృషికి అర్హులైన ప్రతి ఒక్కరికి నిస్పక్షపాతంగా అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆంగోతు హరిచంద్‌నాయక్, ఆర్.శ్రీనునాయక్, వడితే బిచ్చి నాయక్, వడితే ముని నాయక్, గుడిబాయి, ఇస్లావత్‌బాజు, ఆంగోతు మంత్రునాయక్, ఆంగోతు చందునాయక్, ఆర్ నరసింహ, ఆర్ రెడ్డి నాయక్, ఆర్.శంకర్‌నాయక్, ఆర్.కస్నా నాయక్, ఆర్.శేవులునాయక్, రమావత్ మంత్రునాయక్, రమావత్ దస్రూనాయక్, ఆర్.సైదానాయక్, ఆర్.రామునాయక్, ఆర్.పవన్‌నాయక్, ఆర్.కున్యానాయక్, ఆర్.చిన్న బాలునాయక్, బాణావత్ జానినాయక్, ఆర్.చిన్నానాయక్, ఆర్.హర్జీనాయక్, వడితే స్వామి నాయక్, ఆర్.మంత్రునాయక్, మరో 25 కుటుంబాలు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాచర్ల మండల నాయకుడు బూడిద శ్రీను, బూడిద సైదులు, సర్పంచి కేతావత్ శ్రీను నాయక్, రమావత్ హనుమానయక్, ఆంగోతు సీతారామ్ నాయక్, రమావత్ హనుమంతునాయక్, ఆంగోతు శ్రీనునాయక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన నడిగడ్డ గ్రామస్తులతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినుకొండ పట్టణం 29వ వార్డు నుంచి ఐదు కుటుంబాలు, నడిగడ్డ గ్రామం నుంచి ఐదు కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. జగనన్న హయాంలో పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికి మేలు జరిగిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- టీడీపీ నుంచి వలసలు పెరగటం సంతోషకరం

నరసరావుపేట: తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు పెరిగాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మాజీ కౌన్సిలర్ అబ్దుల్ సత్తార్ సారథ్యంలో ఎనిమిదో వార్డు నుంచి చేరిన పది కుటుంబాలకు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వీరందరూ పార్టీలో చేరటం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఆకర్షితులై మైనారిటీలు అధికంగా తమ పార్టీలో చేరుతున్నారన్నారు. తమ పార్టీ మైనార్టీలకు పెద్దపీట వేసిందన్నారు. వైఎస్సార్ భరోసా, జగనన్న ఆసరా, వలంటీర్ వ్యవస్థ, పెన్షన్లు అన్నీ కులాలు, మతాల వారికి అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం మైనార్టీలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్ రద్దు చేసేందుకు కూటమిగా ఏర్పడిన పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పారు. రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. ఎనిమిదో వార్డులో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, కూటమిని ఓడించి వైఎస్సార్ సీపీని గెలిపించాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, సయ్యద్ ఫాతిమా, పెద్దఖాజా, షేక్ మహబూబుబాషా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 55 సంవత్సరాల వయస్సున్న ఓ వ్యక్తి ఫిబ్రవరి 20న గుంటూరు రైల్వే స్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫారంపై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీన్ని గమనించిన హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్ మల్లికార్జునరావు 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. దీంతో జీఆర్పీ పోలీసులు గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440627546, 9908383300 సంప్రదించాలని కోరారు.

జనసేనకు భారీ షాక్

వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకుడు దుర్గారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి: జనసేన పార్టీకి దాచేపల్లి మండలంలో భారీ షాక్ తగిలింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెందిన ముఖ్యనేతలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. జనసేన ఆవిర్భావం నుంచి ఆ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడిన ఆ పార్టీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు మందపాటి దుర్గారావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. దుర్గారావుతో పాటుగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వేల్పుల చైతన్య, హరిదాసు బాలు తదితరులు చేరారు. టీడీపీతో జతకట్టటం ఇష్టం లేకపోవటం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి శరవేగంగా జరగటంతో నచ్చి వారు వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలను అభినందించారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ని చేసే బాధ్యత మనమంతా తీసుకుందని నేతలకు చెప్పారు.

జగనన్న రుణం తీర్చుకుంటాం



మాట్లాడుతున్న పోలూరి వెంకటరెడ్డి, న్యాయవాదులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో న్యాయవాదులతో కలసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దేవుని ఆశీస్సులు, రాష్ట్ర ప్రజల దీవెనలు ఉన్నంత కాలం ఏ శక్తులు అడ్డుకోలేవని స్పష్టం చేశారు. టీడీపీ కూటమి ఎన్ని పన్నాగాలు పన్నినా 2024 ఎన్నికల్లో 175కు 175 నియోజకవర్గాలు గెలిచి సత్తా చాటి చెబుతారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా న్యాయవాదులంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో న్యాయవాదులంతా సమష్టిగా గుంటూరు ఉమ్మడి జిల్లాలోని 17 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్ని గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తకు, పార్టీ నేతలకు న్యాయపరంగా పూర్తిస్థాయిలో అండగా ఉంటామని పేర్కొన్నారు. న్యాయవాదులకు ఎన్నో విధాలుగా అండగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకుంటామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్, న్యాయవాదులు పోకల వెంకటేశ్వర్లు, మొండితోక శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమికి బుద్ధి చెబుదాం

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే నాగుల్‌మీరా




సమావేశంలో మాట్లాడుతున్న నాగుల్ మీరా

వినుకొండ(నూజెండ్ల): దేశంలో ముస్లింల హక్కుల భంగం కలిగించే ఎన్‌డీఏ కూటమికి బుద్ధి చెబుదామని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే నాగుల్‌మీరా అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమి అమలు చేస్తున్న నల్లచట్టాలు, సీఏఏ, ఎన్ఆర్సీ వంటి చట్టాలు ముస్లింల హక్కులను కాలరాస్తున్నాయని గుర్తు చేశారు. అలాంటి కూటమికి చంద్రబాబు మద్దతు ఇస్తుండటంతో తాను ఎన్‌డీఏ కూటమికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీకి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ రద్దు చేస్తామని బీజేపీ నాయకులు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ముస్లింలతో అత్యధికంగా లబ్ధి పొందినట్లు చెప్పారు. వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చి, గెలుపునకు కృషి చేస్తామన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యమంత్రి పెట్టిన రాజకీయ భిక్షతో ఎంపీగా గెలిచి ప్రస్తుతం విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వేనోమ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య

రిటైర్డ్ ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి అత్యంత హేయమైన చర్య అని రిటైర్డ్ ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీచ రాజకీయాలతో రాష్ట్ర ముఖ్యమంత్రిపై టీడీపీ నేతలు దాడులు చేయించడం సిగ్గుచేటని తెలిపారు. రాజకీయంగా ఆయన్ను ఎదుర్కోలేక హతమార్చేందుకు రాళ్ల దాడి చేయించడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. చంద్రబాబు తొలి నుంచి హత్యారాజకీయాలకు నాంది పలుకుతూనే ఉన్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీలో ఉన్నదంతా కూలీలంటూ విమర్శలు చేయడం సరికాదని తెలిపారు. ఎవరైనా కూలీలేనని, వారు లేకపోతే మన జీవనం ఎలా సాగుతుందో చంద్రబాబు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారని చక్రపాణి హెచ్చరించారు.